# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజల ఆరోగ్యం బాగుండాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.
- ❖ రానున్న ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ న్యాయపరమైన చిక్కులను అధిగమించి చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందని ప్రాంతాలకు నీరు అందిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.
- ❖ ఈనెల 21 నుండి ప్రారంభం కానున్న శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు.
- ❖ రానున్న నాలుగు రోజులలో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

==========================

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజల ఆరోగ్యం బాగుండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాలలో పార్కుల ఆధునికరణకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం బాగుంటేనే వ్యక్తిగత ఆదాయం తద్వారా రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్నారు. కాగా, రాష్ట్రంలో ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లను పెట్టామని తెలిపారు. త్వరలోనే నెల్లూరు, కాకినాడ, రాజమహేంద్రవరంతో పాటు రాయలసీమలోని రెండు ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

వచ్చే 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీపై తొలి సంతకం చేసిన సంగతిని గుర్తు చేశారు. జూన్ నెల విద్యా సంవత్సరానికి ముందు నుంచే తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేస్తామని నిమ్మల రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

============================

తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శ్రీకాళహస్తీశ్వరున్ని ఈరోజు మంత్రి దర్శించుకున్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈనెల 21వ తేదీ నుండి శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. మార్చి నెల 2వ వారం వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలిరానున్న నేపథ్యంలో భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు.

============================

అలనాటి నటి, నిర్మాత కృష్ణవేణి ఈ రోజు హైదరాబాద్ లోని ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమె మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. స్టూడియో అధినేతగా, పలు ఉత్తమ చిత్రాలను నిర్మించిన నిర్మాతగా కృష్ణవేణి తెలుగు సినిమా కీర్తిని చాటారని చెప్పారు. రఘుపతి వెంకయ్య అవార్డును అందుకున్నారని గుర్తు చేశారు. ఆమె అనేక భాషల్లో నటించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. నటిగా తనదైన ముద్రవేసిన కృష్ణవేణి మృతి సినీ రంగానికి తీరని లోటు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు.

విరామం

============================

ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలంలో నాగార్జునసాగర్, వేంపాడు మేజర్ కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తో కలసి ఆయన ఈ రోజు కాట్రేనిపాడు గ్రామం నుండి మడిచర్ల గ్రామం జోన్ -3 పరిధిలో అసంపూర్తిగా నిలిచిన కాలువ నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి కావడానికి కొన్ని న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని అన్నారు. వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం పరంగా ప్రయత్నం చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

============================

ఢిల్లీ రైల్వే స్టేషన్ లో జరిగిన తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతికరమని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ అన్నారు. ఈ ఘటనలో మహాకుంభమేళా యాత్రికులకు ప్రాణనష్టం జరగడం బాధాకరమని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతిని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

============================

విశాఖపట్నంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీని ఈ రోజు నిర్వహించారు. విశాఖ బీచ్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ... వర్తమాన సమాజంలో క్యాన్సర్ కేసులు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు అవగాహనతోనే ఈ మహమ్మారినీ ఎదుర్కొనగలమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీ నటి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

============================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో తిరుపతిలోని కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదీన సాయంత్రం అంకురార్పణతో 9 రోజుల బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. కపిలతీర్థంలో ఈ నెల 19 నుండి 28వ తేదీ వరకు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లుగా టీటీడీ అధికారులు తెలిపారు.

============================

రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డుల జారీపై చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ పి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్డుల జారీ, మార్పులు చేర్పులపై ప్రజలనుండి వస్తున్న అర్జీల నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు.

============================

రాష్ట్రంలో వీస్తున్న వాయువ్య, ఈశాన్య గాలులు ప్రభావంతో రానున్న నాలుగు రోజులలో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే నాలుగు డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా ఉండే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. గత రెండు రోజులుగా సగటు ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయని వెల్లడించింది. పొడి వాతావరణం కారణంగా ఎండ తీవ్రత పేరుగుతోందని తెలిపింది. కాగా ఉత్తర కోస్తా దక్షిణ కోస్తా జిల్లాలలో పొగమంచు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

============================

వేసవిలో తిరుమలకు వచ్చే భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చర్యలు తీసుకుంటోంది. మాడ వీధులలో శాశ్వత ప్రాతిపదికన షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లుగా అధికార వర్గాలు తెలిపాయి. అవసరమైనప్పుడు ఉపయోగించుకుని, అవసరం లేని సమయంలో వాటికవే ముడుచుకునేలా శాశ్వతషెడ్లను ఏర్పాటు చేయనున్నట్లుగా పేర్కొన్నాయి. అందులో భాగంగానే ఆలయ మాడవీధులలో శాశ్వత షెడ్ల ఏర్పాటు కోసం సాంకేతిక సర్వేను అధికారులు చేపట్టారు. ఇవి పూర్తి అయితే వేసవి కాలంతో పాటుగా బ్రహ్మోత్సవాల వంటి వేడుకల సమయంలోనూ భక్తులకు ఉపయోగకరంగా, సౌకర్యవంతంగా, ఉంటాయని టీటీడీ అధికారులు పేర్కొంటున్నారు.

============================
============================